

# ఎలమావు-మోసిన ఏరు

సి. ఆనందారామం

క్రొద్దిగా ఊగిసలాడుతున్న పడవ అంచున వయ్యారంగా కూర్చుని, గోదావరి గలగలలతో పోటీపడుతూ పాడుకొంటూంది వాసంతి.

వాసంతికూడా మాతో ప్రయాణ మవడానికి ఒకరకంగా కారణం నేనే. స్టాఫ్ అందరూ పడవ ప్రయాణం ఏర్పాటు చేసుకోగానే నాకు చటుక్కున వాసంతి గుర్తుకొచ్చింది. ఆ అమ్మాయి బాగా చదువుతుందని ఇదివరకే తెలుసు. బాగా పాడుతుందని ఇటీవలే తెలిసింది. ఆ అమ్మాయినికూడా మాతో ఆహ్వానిస్తే బాగుంటుందనే నా ప్రతిపాదన ఏకగ్రీవంగా ఆమోదింపబడింది. తన కే సందేహాలున్నా స్వతంత్రంగా స్టాఫ్‌రూంలోకి వచ్చి నన్నడుగుతూండేది. అందువల్ల నా కామ్మాయితో ఇదివరకే కొంత చనువుంది. అందుకే సాహసించి, పాటలు పాడుదువుగాని మాతో రమ్మనగానే వెంటనే అంగీకరించింది. జానెడు పైగా జరీ అంచున్న పట్టుపావడా కట్టుకుని, కాశ్మీర్ సిల్కుపైట వేసుకుంది. జడగంటలు గోదావరి అలల్ని ముద్దుపెట్టుకొంటున్నాయి. పసుపు రాసిన పచ్చని పాదాలు పాతపడవను కళకళలాడిస్తున్నాయి. పాటతోపాటు గోదావరి అలలమీద చేతితో తాళం వేస్తూంది.

ఈ గోదావరి ఎన్నెన్ని పోకడలు

పోతూందీ?! ఒక్కొక్కసారి ఉత్సాహం ఉరకలువేసే కన్నెపిల్లలా తుళ్ళి తుళ్ళి పడుతూంది. మరికొన్నిసార్లు బాధతో సుడులు తిరిగిపోతూంది. ఇంకా కొన్ని సార్లు ఆరిందాలాగ, గంభీరంగా, తన లోతు తెలియరాకుండా జాగ్రత్త పడు తూంది.

మురిపించే నెచ్చెలిలా, వంపులలో సొంపులు చూపుతోంది.

అల్లరి పిల్లలా గలగలలాడుతూంది.

అలిగిన కాంతలా ముఖం తిప్పు కుంటూంది.

ఇంతా మమ్మల్ని మురిపించి, మా కెవ్వరికీ ఏమీ అర్థంకాకుండా, మమ్మల్ని వెక్కిరిస్తూ, సముద్రం దగ్గరకు పరు గులు తీస్తూంది.

"బాటనీ లెక్చెరర్‌గారు పడవలో కూర్చునే మొక్కలని పరిశీలిస్తున్నారే!" వాసంతి మాటలకి ఉలిక్కి పడ్డాను. ఆవిడ పాట అయిపోయినట్లుంది మరి! ఇంకా నాకు వినిపిస్తూన్న సంగీతం నా గుండెల్లోదా ?

ఆమె మాటలకు సమాధానంగా నవ్వాను.

"మీరు ఎదురుగా ఉండి పాట పాడు తూంటే ఇంకా దేన్నో పరిశీలించటం ఎవరికి సాధ్యం ?''

వాసంతి చెక్కిళ్ళు ఎఱ్ఱగా అయి పోయాయి. తల దించుకుని చేతితో నీళ్లు చిందరవందర చేసేసింది. కొన్నిబొట్లు తుళ్ళి నామీద పడ్డాయి.

"సారీ !" అంది.

"ఎందుకూ ? ఇంకొకళ్ళకి కష్టం కలిగించినప్పుడే ఆ పదాన్ని వాడాలి:''

వాసంతి తలెత్తి నా కళ్ళల్లోకి చూసింది. అవి మెరుస్తున్నాయి.

"నేను అమెరికాలో రీసెర్చి చేస్తు న్నప్పుడు ఒకసారి లాగే పడవ ప్రయాణం చేస్తున్నాం..." హిస్టరీ లెక్చెరర్ మొదలుపెట్టారు.

"అమెరికాలోని గోదావరిలోనాండీ?" అమయకంగా ప్రశ్నించాడు రామశాస్త్రి. రామశాస్త్రి చూడడానికి చిన్నపిల్లాడిలా ఉంటాడు. చిన్నవాడేనేమో ? విద్యార్థు లలో విద్యార్థిగా కలసిపోగలడు. అధ్యా పకవర్గంలో చేరినా ఇంకా విద్యార్థి తనం వదలలేదు.

"మనం ఒక్కొక్కళ్ళం రెండు రెండు రూపాయిలు వేసుకున్నాం. పడవ వాళ్ళకు పదిరూపాయలు...ఇంకా డబ్బు మిగులుతుంది. దీనితో ఏం చెయ్యబోతు న్నారు ? అది మళ్లీ అందరికీ సమంగా పంచుతారా? మనం అందరమూ తలొకటీ పట్టుకొస్తున్నాం. అన్నిటి విలువా సమా నమేనా ?" లెక్కల లెక్చెరర్ నిర్మొహ మాటంగా తెలుగు లెక్చెరర్‌తో చర్చిం చేస్తున్నారు.

"చూశారా! ఇట్లాంటివి ఏవో ఉంటూంటాయి. మనం ఇవన్నీ పట్టిం చుకోకూడదు. ఏమంటారూ?" తెలుగు

లెక్చెరర్ తెగ మొహమాటపడిపోతు న్నారు.

"లెక్కల లెక్చెరర్‌గారు తెలుగు పద్యాలు బాగా పాడతారు. మాస్టారూ! ఒక్కటి పాడరూ?'' వాసంతి అడిగింది.

"అన్యాయం! పక్కన తెలుగు లెక్చెరర్ గారుండగా లెక్కల లెక్చరర్‌ని పద్యాలు పాడమనట మేమిటీ?" నేను అడ్డు చెప్పాను.

"ఫరవాలేదు. ఆయన వ్యాఖ్యాని స్తారు" రామశాస్త్రి సర్దాడు.

"భగవంతుడా! ఏ నేరానికి ఈ కఠిన శిక్ష? ఈ గోదావరి అలలమీద, కలల లోకి తేలిపోయే సమయంలో, తెలుగు లెక్చెరర్‌గారి వ్యాఖ్యానం వినాలా?'' జనాంతికంగా అంది వాసంతి.

"మీరు సరిగ్గా వినాలి. ఆయన వ్యాఖ్యానిస్తారు, అని మాత్రమే అన్నాను. వినాలని అనలేదు. అక్కడ పడవవాళ్లు గొడవగా మాట్లాడుకుంటు న్నారు. దూరంగా గాడిదలు అరుస్తు న్నాయి. గట్టుమీద కుక్కలు దెబ్బలాడు కుంటున్నాయి. ఇవన్నీ మీరు కంటున్న కనబోయే కలలకు అడ్డు రాగలవా?" జనాంతికంగానే సమాధాన మిచ్చాడు రామశాస్త్రి

ఈ జనాంతిక సంభాషణ అక్కడి జనులందరికీ వినిపించింది. నవ్వొచ్చిన వాళ్లు నవ్వారు. అది చూసి నవ్వురాని వాళ్లుకూడా నవ్వారు. మరొక పని చేయలేక తెలుగు లెక్చెరర్‌గారుకూడా నవ్వారు.

ఆ నవ్వు వినేసరికి నా కాయనమీద అంతులేని జాలి కలిగింది.

"మొత్తం మానవ జీవితానికి వ్యాఖ్యానంలా ఆ శ్మశానవాటికలోని గంభీర నిశ్శబ్దం, మానవ జీవితం లోని మాధుర్యాన్ని మృదువుగా గుస గుసలు చెప్పే పైరుగాలీ, మనసులలో మూలమూలల జడత్వాన్ని ఎగిరిపొమ్మని హెచ్చరించే పక్షుల కలకలలూ, ఇవన్నీ ఉండగా, కుక్కలూ, గాడిదలూ కనిపించాయా? స్వజాత్యాభిమానం మరీ అంత దారుణంగా ప్రకటించుకుంటే ఎలా రామశాస్త్రిగారూ?" అన్నాను.

నా బరువయిన మాటలు బొత్తిగా వృథాపోలేదు. తెలుగు లెక్చెరర్ సంతృప్తిగా నవ్వారు. నేను ఉపన్యాసం లాంటిది ఇవ్వబోతున్నానని రామశాస్త్రి పసిగట్టి, కెమెరా దగ్గరికి పారిపోయి, రీలు సర్దడంలో లీనమయిపోయాడు. మిగిలినవాళ్ళలో చాలామంది వినలేదు.

"ఒట్టి పాతపాట;" వెక్కిరిస్తున్నట్టు అంది వాసంతి.

''పోనీ, కొత్తపాట నువ్వు పాడు."

"నేను మీ లాగ లెక్చరర్‌నా? ఉప న్యాసా లివ్వడానికి?"

"కాదు, గాయనివి. అందుకే పాడ మంటున్నాను.''

''నా కొకపాట పాడాలనుంది. మీ

రంతా ఏమనుకుంటారోనని భయపడుతున్నాను."

"అనుకున్నా మీతో చెప్పంలెండి." రామశాస్త్రి ఉవాచ.

"అహ ! ఇందులో అనుకోవడాని కేముంటుందమ్మా ?" తెలుగు లెక్చరర్ గారి అభయం.

"త్వరగా పాడండీ !" లెక్కల లెక్చరర్ గారి ఆదుర్దా.

"ఈ సమయమూ, ఈ సందర్భమూ, ఈ వాతావరణమూ ప్రత్యేకమైనవి. మనం మళ్ళీ బయలుదేరినచోటికి చేరుకునేవరకూ ఎంత అల్లరికైనా లైసెన్స్ ఉంది;" నా వివరణ.

వాసంతి గొంతెత్తింది. అన్ని గొంతులూ ఆగిపోయాయి.

"ఈరేయి నన్నొల్లనేరవా రాజా ...

...............

ఎలుతురంతా మేసి
ఏరు నెమరేసింది
కలవరపు నా బ్రతుకు
కలతనిదురయ్యింది."

పాట పూర్తయినా అందరి మనసులలో ప్రతిధ్వనిస్తూనే వుంది. తనను మళ్లీ ఎవరూ పాడమని అడగకపోయినా, వెనుకటి ప్రార్థనను సహృదయంతో గుర్తుంచుకొని లెక్కల లెక్చరర్ పద్యాలు చదివారు–కాదు, పాడారు.

అవి విన్న మాకు ఏం వచ్చిందో, ఏం రాలేదో చెప్పలేను. కాని, అయనకి చాలా వచ్చింది. ఆ కాస్సేపూ ఆయన తన ఆదాయ వ్యయాల లెక్కలు మరిచిపోయారు.

పడవను ఒడ్డుకు పట్టించారు. అందరమూ కొబ్బరితోటలోకి నడిచాం. మా అందరిలో వాసంతి ఒక్కతే ఆడమ్మాయి. అందుకే చాలా ధైర్యంగా ముందు నడుస్తూంది. పట్టుపావడా జరీఅంచు గరికను వెనక్కు తోస్తూండగా, చేలమధ్య నడిచే వాసంతి వనకన్యలాగే వుంది.

ఒత్తుగా పెరిగిన పచ్చగడ్డిమీద కూర్చున్నాం. పడవవాళ్ళు మా ఫలహారాలు మాముందు ఉంచారు. నేను అందరికీ ఆకులు పెట్టబోతూంటే, వాసంతి నా చేతిలోంచి తను అందుకుంది.

"ఆడదాన్ని నే నుండగా మీరు పనిచేయడమేమిటి మాస్టారూ !" పమిట చెంగు నడుములో దోపుకుని వడ్డనకుపక్రమించింది.

"ఎంత చదువుకున్నా మన ఆడవాళ్ళు ఆడవాళ్లేనండీ!" తెలుగు లెక్చెరర్ మురిసిపోయారు.

అమెరికాలో నేను రీసెర్చ్ చేసేటప్పుడు, అంతా స్వయంగా వడ్డించుకునేవాళ్ళు. అక్కడిలా ఆడా, మగా భేదం లేదు." హిస్టరీ లెక్చెరర్ గారు ఉద్ఘాటించారు.

"అయ్యబాబోయ్! అయితే అమెరికా త్వరలోనే నిర్మానుష్యం కాబోతోందా



మూస్తారూ?" రామశాస్త్రి భయపడి పోయాడు

అప్పటికే తినడం ప్రారంభించటం వల్ల అందరికీ పొలమారింది.

"ఎన్ని మంచినీళ్ళు తాగినా దాహం తీరటం లేదు," పైనున్న కొబ్బరి బొండాలవంక చూస్తూ అంది వాసంతి

"మీరు స్త్రీనని నిరూపించుకున్నారు నాపంతు మిగిలింది," అంటూ లేచాను

"ఏం చేస్తారూ?"

"పురుషుడని నిరూపించుకుంటాను "

కొంచెం సేపట్లోనే- అక్కడికి

కొబ్బరి బొండాలు పట్టించుకు వచ్చాను.

"చాలా థాంక్స్ మాస్టారూ!"

"ఇంతకష్టానికి, ఒక్క థాంక్సేనా?"

"మరేం కావాలి?"

"కైకేయిలాగా ఈ వరాన్ని దాచుకుంటాను. అవసరమైనపుడు అడుగుతాను." సమయానికేం తోచక అన్నాను.

అందరూ పేకాటలో పడ్డారు. నాకు పేకాట అంటే విసుగు. ఒక్కడినీ నడిచివచ్చి చేలమధ్య కూర్చున్నాను.

సంధ్య పడబోతూంది. ఆకాశం క్రమక్రమంగా అరుణవర్ణంలోకి దిగుతూంది. అరుణ...

"మాస్టారూ!"

ఉలిక్కిపడ్డాను — వాసంతి! ఒక్కడినీ ఉన్న నా దగ్గరకి వచ్చిన ఆ సాహసానికి ఆశ్చర్యపోయాను.

"ఏమి టలా చూస్తున్నారు?"

"చూస్తున్నాను. వెంకటగిరి చీరె జరీ అంచులా, ఆ నల్ల మబ్బుకొసను మెరుస్తున్న అరుణ కాంతుల్నీ, సిగ్గుపడిన స్త్రీ మూర్తిలా కందిపోతున్న ఆ సూర్యబింబాన్నీ..."

"ఆగండి! ఆగండి!! అర్ధమయింది లెండి. మీ ఊహాసుందరిని తలచుకొంటున్నా రన్నమాట."

"ఊహా సుందరేం కర్మ? వాస్తవ సుందరినే తలచుకొంటున్నాను."

"ఊ!? ఎలా ఉంటుందేం, మీ వాస్తవ సుందరి?"

"పెద్ద పొడుగైన జడ, వెంట్రుకలు చివర కుచ్చులా ఉంటాయి."

వాసంతి గబగబ జడగంటలు విప్పేసింది.

"జరీఅంచు వెంకటగిరి చీరె..."

వాసంతి దిగులుగా తన పరికిణీ వంక చూసుకుంది.

"పచ్చగా, సన్నగా, పొడుగ్గా—"

వాసంతి తనను తాను సంతృప్తితో చూసుకొంది.

"నా హృదయంలో తిష్టవేసుకుని కూర్చుంది."

వాసంతి ముఖంలో కోటి మెరుపులు మెరిశాయి. ఆమె చిరునవ్వు అనురాగానికి అద్దం పట్టింది.

"పద, వెళ్దాం;" లేచాను.

"అప్పుడే పొద్దు పోయింది." దిగులుగా అంది వాసంతి.

"అది కాలధర్మం;" నవ్వాను.

తిరుగుముఖం పట్టాం —

"అ రె రె!! నా పెన్ మర్చిపోయాను," అన్నారు హిస్టరీ లెక్చెరర్.

"మీరు అమెరికాలో థీసిస్ రాసిన దేనా?" గాభరాపడిపోయాడు రామశాస్త్రి.

ప్రవాహానికి ఎదురుగా ప్రయాణం చేస్తూండటంవల్ల పడవలు మందంగా సాగుతున్నాయి. ఎవరి కబుర్లలో వాళ్ళు పడిపోయారు. వాసంతి నామీద అదే పనిగా నీళ్ళు చల్లుతూంది.

"ఇంత అల్లరా?"



"గట్టు చేరేవరకూ చెయ్యవచ్చన్నా ధుగా ?"

"దీని ఫలితాలు గట్టు చేరడంతో ఆగి పోవుగా ! ఇంకా వెంబడిస్తాయి."

"ఏమిటో అవి ?"

"నాకు జలుబు చేస్తుంది. ఆ తర్వాత జ్వరం వస్తుంది."

"అంతేనా? ఐతే ఇంకా జల్లుతాను."

"నాకు జ్వరం రావడం నీ కిష్టమా?"

"జ్వరం వచ్చిన తర్వాత సేవ చెయ్యడం ఇష్టం. కథల్లో నేతప్ప మామూలుగా అలాంటి అవకాశాలు రావు."

"నువ్వు నాకు సేవ చేస్తావా ?"

"అది నా అదృష్టం అనుకుంటా!"

"ఏ పరిస్థితుల్లో ?"

"ఏ పరిస్థితుల్లోనైనా సరే !"

"చూస్తాను."

"చూడండి."

కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా దొర్లాయి.

"ఇందాక ఏం కావాలో అడగమన్నావు. అడగనా ?"

"అడగండి."

"ఒక్కసారి మా యింటికి రా—"

వాసంతి శరీరం పులకించటం నాకు స్పష్టంగా కనిపించింది.

"ఎందుకూ ?"

"ఒక విషయం చెపుతాను. వీలయినప్పుడు రా—"

"ఇప్పుడే వస్తాను."

"ఇంకా ఆలస్యం కాదూ ?" మీ ఇంట్లోవాళ్ళు ఏమైనా అనరూ ?"

"మీతో కొన్ని క్షణాలు గడపగలగడంకోసం ఏదైనా భరిస్తాను."

రామశాస్త్రి గట్టిగా తుమ్మాడు.

వాసంతి అదిరిపడింది.

తెలుగు లెక్చెరర్ ఏదో వైరిసమాసము అంటున్నారు.

"ఏది వైరిసమాసం ? ఆయన మన పడవలో కూర్చోవటమా?" రామశాస్త్రి నాతో అతి మెల్లిగా అన్నాడు.

వాసంతి కలకల నవ్వింది.

నేను పాడమన్నాను.

"పాడదలచిన పాటలన్నీ నానోట పాడించ మన సామెనయ్యా, గురువర్యా—" అని పాడింది.

పడవ గట్టు చేరింది.

కులాసాగా విడిపోయాం.


మా యింటిని సమీపిస్తూండగా వాసంతి కలిసింది.

"అప్పుడే వచ్చేదాన్ని మాస్టారూ ! వాళ్ళంతా వున్నారని—" ఆగిపోయింది వాసంతి.

"మంచిపని చేశావు. పూర్తిగా నిన్ను నువ్వు మరిచిపోలేదు."

తాళం తీశాను. హాల్లోకి వచ్చాం. ఎదురుగా నిలువుటద్దంలో మా యిద్దరి ప్రతిబింబాలూ కనిపించాయి. వాటివంక చూస్తూ నిలబడిపోయింది వాసంతి.

"నా వాస్తవ సుందరిని చూపించనా?"




"చూపించండి;" అద్దంలో తన ప్రతిబింబాన్ని మురిపెంతో చూసుకుంటూ అంది వాసంతి.

"కూర్చో ! వస్తాను."

లోపలకి నడిచాను. లిప్తమాత్రం నావంక వింతగా చూసింది వాసంతి. కొద్దిక్షణాల్లోనే నా వాస్తవ సుందరిని వాసంతి ముందు ఉంచాను.

పొడుగుజడ, వెంకటగిరి జరీచీరె కట్టుకున్న మా అరుణఫొటోవంక చూస్తూ అచేతనంగా వుండిపోయింది వాసంతి. ఆమెను పలుకరించలేకపోయాను.

చాలా సేపటికి వాసంతే మాట్లాడడానికి ప్రయత్నించింది.

"ఈమె...ఈమె..." పూర్తిచెయ్యలేకపోయింది.

"నా భార్య! ఇందాకనే చెబుదామనుకున్నాను. కాని ఆ వాతావరణంలో నీ మనసు పాడు చెయ్యటానికి సాహసించలేకపోయాను."

నవ్వడానికి ప్రయత్నించినా, అందులో జాలి నింపుకున్న విషాదం తొంగిచూసింది.

"మీ భార్యా!!" అయోమయంగా అడిగింది.

"అవును. నా కొడుకుకి తల్లి."

"కొడుకా ?"

"ఉండు వాడి ఫొటో చూపిస్తాను."

నేను మా బాబు ఫొటోతో తిరిగి వచ్చేసరికి వాసంతి లేదు నేను ఆశ్చర్యపడలేదు.

చతుర్దశిచంద్రుని చల్లని కాంతులు గోదావరి కెరటాలలో విరిగిపోతున్నాయి.

"ఎలుతు రంతా మేసి ఏరు నెమరేసిందీ___!!" ✱